భావవిప్లవ దీపిక  మానవవాద వీచిక

# మానవ వికాస వేదిక

(రి.నెం. 03/2005)

# ప్రణాళిక


కేంద్ర కార్యాలయం: 5-229, జె.పి.యన్.నగర్, మియాపూర్, హైద్రాబాద్-500049.
సెల్: 94904 19044, Email: mvvedika@gmail.com




వాస్తుపేరుతో జరిగే
ప్రజాధన దుర్వినియోగాన్ని
ఆపేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ
నాటి ఆర్థికమంత్రి కె.రోశయ్యగారికి
వినతిపత్రం సమర్పణ (13-6-2009)




మా.వి.వే. నిర్వహించిన 'కులనిర్మూలన' సదస్సులో ప్రొ॥ హరగోపాల్(ప్రసంగిస్తున్న),
మల్లాది సుబ్బమ్మ, బి.సాంబశివరావు, ప్రొ॥ కేశవరావ్ జాదవ్(11-12-2005)




జమ్మికుంటలో మా.వి.వే. ఉచిత వైద్య శిబిరం (25-5-2005)



మా.వి.వే.కు-మల్లాది సుబ్బమ్మ ట్రస్టు పురస్కారం
లక్షరూపాయలను డా॥ సినారె, మల్లాది సుబ్బమ్మల
ద్వారా అందుకొంటున్న దృశ్యం



గణిత ప్రతిభా పరీక్షల బహుమతి ప్రదానోత్సవం
(ఆదిలాబాద్ జిల్లా 4-10-2006)

# మానవ వికాస వేదిక

## ఎ. ఆలోచనలు-ఆశయాలు

### 1. తాత్విక నేపథ్యం:

అనంతమైన ఈ విశాల విశ్వంలో మన భూమి ఒక చిన్నగ్రహం. కొన్ని వందల కోట్ల సంవత్సరాల క్రితం జరిగిన పదార్థ పరిణమాల వల్ల నీటిలో ఏకకణ జీవం పుట్టింది. నాటి వాతావరణానికి తగినట్లు కొన్ని రసాయనాల సమ్మేళనంతో ప్రత్యేక పరిస్థితులలో ఏర్పడిన జీవం, క్రమంగా బహుకణజీవిగా మారింది. నీటి నుంచి, నేలపైకి వచ్చి నివసించే జీవులు ఏర్పడడానికి చాలా ఏండ్లు పట్టింది. జలచరాలు, స్థలచరాలు, ఉభయచరాలుగా మారిన జీవులు– చెట్లుగా, పాకుడు జంతువులుగా, ఎగిరేజీవులుగా ఎదిగాయి. ఆహారసేకరణ కోసం చేసినశ్రమ, ప్రయత్నాల వల్ల ఆయా జీవుల అవయవాలలో మార్పులు వచ్చాయి. ముందరి రెండు కాళ్ళు చేతులుగా మారడం, ఆలోచనా కేంద్రంగా మెదడు ఏర్పడటం వానరజాతి పుట్టుకకు నరుని పరిణామానికి కారణాలు అయ్యాయి. మొత్తం జీవపరిణామంలో నరుని అవతరణ ముఖ్యమైనది. కోట్లాది జీవరాశులలో అత్యున్నత బుద్ధిజీవిగా మారటానికి మనిషికి కొన్ని లక్షల సంవత్సరాలు పట్టింది.

ఆటవిక దశలో ఆలోచన వికసించని మానవుడు తనకు కనిపించే వింతలకు, ప్రకృతి భీభత్సాలకు భయపడ్డాడు. దిక్కుతోచక తన భయాన్ని శాంతపరచుకోవటానికి ప్రకృతి శక్తులకు సాగిలపడి మొక్కాడు. ప్రార్థనలు, వేడుకలు, ఆటపాటలు, బలులు, అర్పణలు, తర్పణలు, మొదలైన క్రియల ద్వారా ఆ శక్తులను తృప్తి పరుస్తున్నాననుకొని తాను సంతృప్తి చెందాడు. అవే క్రమంగా దైవారాధనగా మారాయి. వీటిని చేయించడానికి పూజారులు, పూజావిధానాలు, మంత్రోచ్చారణలు, కథలు, పవిత్రగ్రంథాలు, మందిరాలు కాలక్రమంలో ఏర్పడ్డాయి. దేశకాలాదులను బట్టి ఇవి వేరువేరుగా ఉన్నా ఇలాంటివన్నీ ఉన్న వ్యవస్థను 'మతం' అన్నారు. మతాధిపతులుగా ఎదిగిన వారు మిగిలిన సమాజంపై తమ పెత్తనాన్ని సాగించారు. మొదట్లో మతనాయకులే పాలకులుగా ఉన్నప్పటికీ క్రమంగా మతనాయకులు, పాలకులు వేరయ్యారు. మిగిలిన జనాభాను తమక్రింద అణచివుంచటానికి అవసరమైన మతచట్టాలను, శాసనాలను వారు ఇరువురు చేసారు. మతగ్రంథాల ఔచిత్యాన్ని, పాలకనీతిని ప్రశ్నించరాదని, భిన్నంగా వ్యవహరించరాదని శాసించారు. భౌతిక శిక్షలేవీ భావాలను చంపలేవు. సహజంగా ఆలోచనాజీవి అయిన మానవుడు స్వేచ్ఛకోసం, జ్ఞానంకోసం నియంతృత్వ శక్తులపై పోరాటాలు చేసాడు. మతాల మాయాజాలం నుంచి తనను తప్పించుకుంటూ తన తోటి సమాజాన్ని కూడా తప్పించటానికి ప్రయత్నించాడు. అలా ప్రత్యామ్నాయ భావజాలం ఏర్పడింది. ఆ భావజాలం కలవారిని నాస్తికులు, సైతానులు, కాఫిర్లు, పాషండులు మొదలైన దూషణనామాలతో రకరకాల హింసలకు గురిచేసారు మతవాదులు. అయినా ప్రపంచ పరిణామానికి, ప్రగతికి ఆ ప్రత్యామ్నాయ భావాలే వెలుగు చూపాయి. వాటి ఫలితంగా శాస్త్ర, సాంకేతిక విజ్ఞానాలు, కళలు, నాగరికత, సంస్కృతులలో

మానవుని కేంద్రంగా చేసుకుని అభివృద్ధి జరిగింది.

భారతదేశంలో అటువంటి వికాసానికి ఆద్యులు చార్వాకులు. ప్రకృతి ఆరాధన, సమష్టి జీవన చిత్రణలతో నిండిన వేదాలను తమకు అనుకూలంగా మలచుకొని, తమ ఆధ్యాత్మిక భావాల వ్యాప్తికోసం ఆచారాలను, సాహిత్యాన్ని కల్పించి ప్రజలను వంచిస్తున్న పురోహితుల, పాలకుల పెత్తనాలకు వంచనలకు వ్యతిరేకంగా చార్వాకులు భావవిప్లవం సాగించారు. వారి ప్రేరణతో జైనం, బౌద్ధం వంటి కొత్త తాత్విక మార్గాలు ఏర్పడ్డాయి. చార్వాకుల భౌతికవాదం భారతీయ తత్వశాస్త్రాన్ని సుసంపన్నం చేసింది. వారు చూపిన బాటలో కాలానుగుణంగా ఎందరో పయనించి మానవజాతి వికాసానికి తోడ్పడ్డారు.

“మానవుడే అన్నిటికీ ప్రమాణం” అన్న గ్రీకు తాత్వికుడు ప్రోటోగరస్‌కు ముందు నుండి నేటి వరకు మానవవాదం మనిషి ఔన్నత్యం కోసం కృషి చేస్తూనే ఉంది. స్వేచ్ఛ, సమానత, సహజీవనం వంటి సాంఘిక విలువలతో నిండిన మానవవాదం మతానికి వ్యతిరేకం. సైన్సుతో విడదీయరాని అనుబంధం దానిది. ప్రేమ, కరుణ, సహనం, సహకారం వంటి మానవతా విలువలు దానికి అంతరంగాలు. కుల, మత, జాతి, వర్ణ, దేశ, భాషా, ప్రాంత వివక్షతలు, విభేదాలు లేని విశ్వమానవ సమానత మానవవాద ధ్యేయం. సానుకూలతగల విశాల ఆలోచనలతో సమాజాన్ని అభివృద్ధి వైపు నడిపించే కృషిలో అది నిరంతరం పురోగమిస్తుంది.

## 2. నిర్వచనం:

వికాసం అనే పదానికి విచ్చుకోవటం, అభివృద్ధి, పురోగమనం అనే అర్థాలు ఉన్నాయి. మనిషి ఆలోచనల్లోను, మనుగడకు సంబంధించిన వివిధ రంగాలలోను సంఘం సాధించే సానుకూల ప్రగతినే ‘మానవ వికాసం’గా ఈ వేదిక భావిస్తున్నది. వ్యక్తి, సమాజం పరస్పర ఆశ్రితాలు. ఆ రెండింటి వికాసమే మానవ వికాసమవుతుంది. నాస్తిక, హేతువాదాలు భూమికగా ఉన్న మానవవాదం ఈ వేదికకు తాత్వికాధారం.

## 3. ఆశయాలు-కర్తవ్యాలు:

### 1. కుల నిర్మూలన:

భారతదేశ ప్రగతిని అడ్డగిస్తున్న వాటిలో ప్రధానమైనది కులం. వైదిక కాలంలో వర్ణంగా ఉండి, రాచరిక వ్యవస్థలో కులంగా మారి, మనుస్మృతి వంటి ఫాసిస్టు మతగ్రంథాల ద్వారా విస్తరించి, భూస్వామ్య వ్యవస్థలో ఇది బలపడింది. అన్ని కాలాల్లోను విద్య, అధికారం, ధనం ఎవరి చేతుల్లో ఉండేవో వారి ఎదుగుదలకే ఈ వ్యవస్థ తోడ్పడింది. ఆ మూడింటిని సొంతం చేసుకున్న కులాల వారే మిగిలిన వారిని నీచులుగాను, అంటరానివారు గాను చిత్రించి కనీస హక్కులు కూడా వారికి లేకుండా చేసారు. ప్రజల్ని చీల్చి ప్రజాస్వామిక విలువల్ని కాలరాచే స్వభావం కులానికి ఉంది. అది ఒక మానసిక జాడ్యం. స్వార్థపరులకు, రాజకీయ పార్టీలకు తురుపుముక్క. సాంఘిక నేరస్తులకు రక్షాకవచం. భారతీయ ప్రతిష్ఠకు,

చరిత్రకు చెరగని కళంకం. సంఘాన్ని ముందుండి నడిపించాల్సిన కొందరు మేధావులు, విద్యావేత్తలు కూడా ప్రత్యక్షంగానో, పరోక్షంగానో కులవ్యాప్తికి తోడ్పడుతున్నారు. ఆత్మగౌరవమనో, అస్తిత్వంకోసమనో కులచైతన్యాన్ని మరింతగా పెంచుతున్న కులసంఘాల, రాజకీయపార్టీల కొన్ని కార్యక్రమాలు కులాన్ని బలోపేతం చేస్తూ.. అంతిమంగా కులనిర్మూలనకోసం జరిగే పోరాటాలను బలహీన పరుచుటకు కారణమవుతున్నాయి. పట్టణాలలోని బహిరంగ ప్రదేశాలలో, కులం తగ్గినట్లు కనిపించినా పల్లెల్లోను, అత్యధిక ప్రజల మనసుల్లోను అది పదిలంగానే ఉంది. ఇప్పటికీ దళితులపైన, వెనుకబడిన కులాల వారిపైన దేశమంతటా జరుగుతున్న దాడులు, వేధింపులు దీనిని స్పష్టం చేస్తున్నాయి. అమానుషత్వానికి మారుపేరుగా నిలిచిన కులవ్యవస్థ నిర్మూలన జరగాలని, ప్రపంచమంతటా కన్పిస్తున్న వర్ణ వివక్షత అంతం కావాలని, ఈ వేదిక బలంగా కోరుతున్నది.

## కర్తవ్యాలు:

1. అంటరానితనానికి, కులవ్యవస్థకు వ్యతిరేకంగా ఈ వేదిక ఉద్యమిస్తుంది.
2. కులాంతర పెళ్ళిళ్ళను ప్రోత్సహించి కులరహితులకు విద్యా, ఉద్యోగాలలో రిజర్వేషన్‌కోసం పోరాడుతుంది.
3. ప్రస్తుత రిజర్వేషన్లను ఆయా కులాల వారి అభివృద్ధికి ఊతకర్రలుగా భావిస్తూ కులం లేకుండా జీవించే చైతన్యం, పరిస్థితులు ప్రజలలో రావడానికి కృషి చేస్తుంది.
4. కులనిర్మూలన ప్రచారం కోసం సభలు, చర్చావేదికలు, చైతన్య యాత్రలు మొదలగునవి నిర్వహిస్తుంది.
5. కులరహితంగా ప్రజలను కలిపివుంచేందుకు ప్రత్యామ్నాయ విధానాలు రూపొందించి అమలు చేస్తుంది.

## 2. మతంలేని జీవితం:

మనిషి ప్రగతిని నిరోధిస్తున్న మరో అవరోధం మతం. మానసికంగానే కాక, సాంఘికంగా, ఆర్థికంగా కూడా ఇది మనిషిని దోపిడి చేస్తుంది. అణచివేతకు తోడ్పడుతుంది. దైవభావం, తలరాత, కర్మసిద్ధాంతం, పునర్జన్మ, ఆత్మ, స్వర్గం, నరకం వంటి నిరాధార కల్పనలతో మనుషులను భావదాసుల్ని చేసి వైజ్ఞానిక ఆలోచనల్ని అణచివేసింది. విద్యని, కళల్ని, సంస్కృతిని కొన్ని కులాల, వర్గాల పెత్తనానికి లోబరచి దానిని సమర్థించే నీతుల్ని, విలువల్ని బోధించింది. పరలోక సుఖాల ఎండమావుల్ని చూపి, దైవ విధేయతని బోధించి, పరాధీనతను పెంపొందిస్తోంది. సామాజిక శాంతిని భగ్నం చేస్తోంది. అన్ని మతాలు శాంతినే బోధిస్తాయనటలో నిజంలేదు. అలా శాంతినే బోధిస్తే మత ఉగ్రవాదానికి అవకాశమే ఉండదు. మనిషిని విస్మరించి దైవాన్ని కీర్తించే మతవిలువలు సాంఘికనీతిని, సమానతను ఏర్పరచలేవు. మతం దూరమైనపుడే మనుషుల మధ్య సామాజిక స్పృహ, బాధ్యత, ఐక్యత పెరుగుతాయి. మతాలతో సంబంధం లేకుండా మనుషులు కలిసి జీవించడం ద్వారా మతరహితమైన మధుర జీవితాన్ని సంఘంలో నెలకొల్పవచ్చని అదే నేటి మానవాళికి అవసరమని ఈ వేదిక భావిస్తున్నది.

## కర్తవ్యాలు:

1. మతఛాందసవాదాన్ని, ఉగ్రవాదాన్ని వ్యతిరేకించే కార్యక్రమాలు చేపడుతుంది.

2. మతరహిత జీవన ప్రాధాన్యత గురించి సభలు, సమావేశాలు, ప్రచారయాత్రలు చేపడుతుంది.

3. ప్రజలలో ఐక్యతను పెంచే సమతా ఉత్సవాలను చేపడుతుంది.

4. ప్రభుత్వ సంస్థలో, బహిరంగ స్థలాలలో మతచిహ్నాలను తొలగించాలని దానిపై ప్రత్యేకచట్టం అవసరమని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తుంది.

5. మతోన్మాదానికి వ్యతిరేకంగా సాహిత్యం, కళలు మొదలైన సాంస్కృతిక కార్యక్రమాలద్వారా కృషిచేస్తుంది.

## 3. మహిళా సాధికారత:

కుటుంబంపై తండ్రి పెత్తనం మొదలైన రోజునే మహిళల హక్కులు, స్థాయి దిగజారాయి. మహిళ ఇంటి బానిసగా మాత్రమే కాక సాంఘికంగా రెండోస్థాయివ్యక్తిగా మారింది. మతము, పవిత్రగ్రంథాలు కూడా పురుషుల కల్పితమే గనుక స్త్రీలను అవి నీచంగానే చిత్రించాయి. మతాధిపత్యం గల సాహిత్యం చట్టాలు కూడా వారికి అన్యాయమే చేసాయి. ఏ కులంలో పుట్టినా స్త్రీలకు ఆ కులహక్కులు కూడా లేవు. పురుషునితో సమానంగా పనిచేసినా, సమాన ఆదాయంగాని, ఆస్థిగాని పొందే హక్కులేదు. గృహహింస, లైంగికహింస, దౌర్జన్యాలు, భ్రూణహత్యలు, వరకట్నవేధింపులు, బలవన్మరణాలు మహిళల దుస్థితికి అద్దం పడతాయి. కళలు, సంస్కృతి, సాహిత్యంలో కూడా మహిళలకు అవమానమే. అంతటా పురుషాధిపత్య భావజాలమే. విద్యలో, పెంపకంలో వివక్షత స్పష్టంగా ఉంది. ప్రజాస్వామిక విలువలేవీ స్త్రీలకు అమలుకావు. అవసరమైనప్పుడు స్త్రీలను పొగడ్తలతో ముంచి అవకాశాల్లో, హక్కుల్లో అన్యాయం చేయడం అనాదిగా కొనసాగుతూనే ఉంది. "భారతదేశం వెనకబడటానికి గల కారణాలలో లైంగిక అసమానత ఒకటి" అన్న ఆర్థిక పరిశీలకుల విశ్లేషణను ఈ వేదిక సమర్థిస్తున్నది. ఆ అసమానత తొలగాలని అన్ని రంగాలలో మహిళలకు స్వావలంబన, సాధికారత లభించాలని కోరుతోంది.

## కర్తవ్యాలు:

1. మహిళలపై జరిగే అన్ని రకాల వేధింపులను, దౌర్జన్యాలను, హింసలను ఖండించి, న్యాయంకోసం పోరాడుతుంది.

2. మహిళలపట్ల ఉన్న వివక్షతను తొలగించే కార్యక్రమాలను రూపొందించి అమలుచేస్తుంది.

3. లౌకికపునాది గల ఉమ్మడి పౌరస్మృతిని ఏర్పరచి దేశమంతటా అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తుంది.

4. దేశమంతటా మహిళలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలలో రిజర్వేషన్లు ఉండాలని కోరుతూ అవి సక్రమంగా అమలు కావటానికి వేదిక కృషి చేస్తుంది.

5. మహిళల్లో ఆర్థిక స్వావలంబన, సాంఘిక భద్రతలను పెంచే చర్యలకోసం ప్రభుత్వంపై పోరాడుతుంది.

6. స్త్రీ, పురుష సమానత కోసం ప్రచార కార్యక్రమాలు చేపడుతుంది.

## 4. మానవీయ విలువలు, సంస్కృతీ ప్రచారం:

సంఘజీవితమున్న చోట సంస్కృతి ఉంటుంది. జీవించటానికి అవసరమైన ఆహారం, పని, నివాసం, వేషధారణ, ఉత్సవాలు, ఆచారాలు, సాహిత్యం, భాష, కళలు మొదలైనవన్నీ జాతి సంస్కృతిని నిర్ణయిస్తాయి. కాలాన్ని బట్టి, ఆధిపత్య శక్తుల ప్రభావాన్ని బట్టి, అవసరాలను బట్టి సంస్కృతిలో మార్పులు వస్తుంటాయి. మనదేశంలో సింధూ నాగరికతను బట్టి అప్పటి ప్రజల సంస్కృతి తెలిసింది. ఆ తర్వాత మతం, కులం, భూస్వామ్యం, రాచరికం, విదేశీయత, మొదలైన అంశాలన్నీ సంస్కృతిని ప్రభావితం చేసాయి. ఫలితంగా కుల, మత, జాతి, భాషాదులలో భిన్నత్వం ఏర్పడి, వాటన్నిటి సమాహార రూపంగా భారతీయ సంస్కృతి ఏర్పడింది. ఈ సంస్కృతిలోని అనైక్యత స్వార్ధపరుల ప్రయోజనాలకు తోడ్పడుతుంది. అవినీతి, అక్రమసంపాదన, అశ్లీలత వంటి సంఘవ్యతిరేక చర్యలపట్ల పోరాటానికి ప్రోత్సాహం కరువవుతున్నది. స్పష్టమైన సాంఘికనీతి లేదు. ప్రజాస్వామికత లేదు. ప్రేమ, కరుణ, సహనం, సహకారం, శీలం వంటి సాంఘిక మానవీయ విలువలకు ఆదరణ తగినంతగా లేదు. మనిషిని మనిషిగా కాక కులాన్ని, మతాన్ని, ధనాన్ని, హోదాను బట్టి గౌరవించే దుస్థితి నేడు సంఘంలో ఉంది. దాన్ని తప్పించి మనిషిని మనిషిగా గౌరవించే సంస్కృతిని ఏర్పరచుకోవాలి. మానవీయ విలువలతో ఏర్పడే సంస్కృతి అందుకు తోడ్పడగలదని ఈ వేదిక ఉద్దేశ్యం.

### కర్తవ్యాలు:

1. బౌద్ధం ప్రవచించిన నైతిక, మానవీయ విలువలలో నేటికి అవసరమైన వాటిని గూర్చి వేదిక ప్రచారం చేస్తుంది.
2. వేదిక సభ్యులలో నైతిక విలువలను పెంచుతూ ఆదర్శ కుటుంబ జీవితాన్ని ఏర్పరస్తుంది.
3. సంఘంలో వేగంగా వ్యాపిస్తున్న వ్యాపార విలువలు, అనైతికత, అమానవీయతలను ఖండించి, మానవ సంబంధాల ప్రాముఖ్యతను, మానవీయ సంస్కృతినీ పెంచే కార్యక్రమాలు చేస్తుంది.

## 5. మానవ హక్కుల పరిరక్షణ:

పుట్టిన ప్రతి శిశువుకు జీవించే హక్కు సహజంగానే వస్తుంది. బ్రతికినంతకాలం సాంఘికనీతిని పాటించటం, మానవహక్కులను అనుభవించటం, ఉన్న బాధ్యతలను నెరవేర్చటం, మనిషి కనీస కర్తవ్యాలు. చరిత్రలో ఈ మూడు కరువైన కాలమే ఎక్కువగా ఉంది. తన భావాలను స్వేచ్ఛగా వెల్లడించే హక్కుకోసం చావుకైనా వెనకాడని మహానుభావులు చేసిన త్యాగాల వల్ల మానవహక్కుల స్పృహ ఏర్పడింది. హక్కుల సాధనకోసం ప్రపంచమంతటా చాలామంది బలయ్యారు, అవుతున్నారు. సంకుచితత్వం, స్వార్ధంతో నిండిన కుల, మతాల వంటి వ్యవస్థలు, వివక్షతలు, పాలకపక్షాల అప్రజాస్వామికత– స్వేచ్ఛను, స్వేచ్ఛాపోరాటాలను అణచటానికే ప్రయత్నిస్తున్నాయి. అందుకు తగిన శాసనాలను నిరంకుశంగా అమలు చేస్తున్నాయి. స్వేచ్ఛ అనేది మనిషికి జన్మహక్కు. సహజంగా లభించిన

మానవీయ విలువ అన్ని హక్కుల సాధనకు, బాధ్యతల నిర్వహణకు అదే మూలం. కానీ అడుగడుగునా దానికి సంకెళ్ళు పడుతున్నాయి. హక్కులు బాధ్యతలు ఒకే నాణానికి బొమ్మ, బొరుసూ. బాధ్యతలు అడగకుండానే వస్తాయి. హక్కులు మాత్రం పోరాడితేనే వస్తున్నాయి. కనుక అన్ని రకాల మానవహక్కుల సాధనకోసం ఈ వేదిక పోరాడుతుంది.

### కర్తవ్యాలు:

1. 1948లో ఐక్యరాజ్యసమితి రూపొందించిన 'విశ్వమానవహక్కుల ప్రకటన పత్రాన్ని', ఆ తరువాత వచ్చిన మహిళల, బాలల తదితర హక్కుల పత్రాలను ఈ వేదిక ప్రమాణంగా తీసుకొని వాటి అమలుకై పోరాడుతుంది.
2. వృద్ధుల సంక్షేమానికి కార్యక్రమాలు రూపొందిస్తుంది.
3. రచయితల, ఉద్యమకారుల, పత్రికల, ప్రజాస్వామిక సంఘాలపై ఎక్కడ నిర్బంధాలు, అణచివేతలు, హింసాదౌర్జన్యాలు జరిగినా వాటిని ఖండించి న్యాయంకోసం పోరాడుతుంది.
4. మానవహక్కులపై ప్రజలలో చైతన్యాన్ని పెంచే సభలు, సాహిత్య ప్రచారాన్ని సాగిస్తుంది.

## 6. లౌకిక, ప్రజాస్వామ్య రాజనీతి పెంపుదల:

మతానికి, రాజనీతికి పూర్వం నుంచి విడదీయరాని బంధం ఉంది. మొదట్లో మతాధిపతులే పాలకులుగా ఉన్నా, కాలక్రమంలో వేరయ్యారు. ఒకరి అండతో ఇంకొకరు జంటగా సమాజంపై పెత్తనం చేసారు. స్వేచ్ఛాలోచనల్ని అణచివేసారు. రాజనీతికి మతం దూరంగా ఉండాలన్న అంశంపై జరిగిన పోరాటాల వల్ల 'లౌకికవాదం' ఏర్పడింది. కాని సర్వమతాలను సమానదృష్టితో ఆదరించి పాలించటమే లౌకికవాదమన్న అర్థం మనదేశంలో చెప్పబడుతున్నది. ఇది మతప్రీతి గల మేధావులు, రాజకీయ నేతలు చేస్తున్న వక్రీకరణ మాత్రమే. మతాన్ని రాజ్యానికి దూరంగా ఉంచటమే సరైన లౌకికవిధానం. సంఘంలో లౌకికవాదం ప్రబలితే ప్రజాస్వామ్యం పెరగుతుంది. ప్రజాసంక్షేమం జరుగుతుంది. అది తక్కువైనందువల్లనే మన రాజకీయాలలో వంశపారంపర్యత, నిరంకుశత్వం, ధనప్రాబల్యం, గొర్రెదాటుతనం, ప్రలోభాలకు లొంగుబాటు, నేరదృష్టి, వ్యక్తి ఆరాధన, వంచన మొదలైన అప్రజాస్వామిక అంశాలు చోటు చేసుకున్నాయి. ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక అసమానతలు ఇంకా ఉండటానికి, అవినీతి అంతటా వ్యాపించటానికి కూడా ప్రజలలో ప్రజాస్వామ్య చైతన్యం కొరవడటమే కారణం. సాంఘిక ప్రజాస్వామ్యం లేనందువల్లనే రాజకీయ ప్రజాస్వామ్యం అమలు కావటం లేదు. ఈ పరిస్థితి నుంచి బయటపడాలంటే లౌకిక, ప్రజాస్వామ్య రాజనీతి గురించి ప్రజల్లో నిరంతర ప్రచారం జరగాలి.

### కర్తవ్యాలు:

1. కుటుంబంలోనూ, సమాజంలోనూ ప్రజాస్వామ్యం పెరగాలని వేదిక ప్రచారం చేస్తుంది.
2. రాజకీయాలలో అప్రజస్వామికతను తొలగించే కృషిలో ఇతర సంఘాలతో కలిసి పోరాడుతుంది.
3. మతాన్ని రాజకీయాలనుంచి దూరంగా ఉంచే చట్టం తయారీకి, అమలుకు కృషి చేస్తుంది.
4. పాలనాసంస్థల్లో, వ్యవహారాల్లో మతపరమైన చర్యలను, ఆరాధనలను అడ్డుకుంటుంది.

5. అప్రజాస్వామికంగా ఒకదేశం, మరోదేశం వ్యవహారాలలో జోక్యం చేసుకోవటాన్ని, ఆక్రమించుకోవటాన్ని, అక్రమార్జనకు పాల్పడటాన్ని వ్యతిరేకిస్తూ కార్యక్రమాలు చేస్తుంది.

## 7. శాస్త్రీయ దృక్పథం:

ఏ సమస్యనైనా తగినంత సమాచారంతో పరిశీలించి, ఆ పరిశీలనలను ప్రయోగపూర్వకంగా నిర్ధారించుకొని, అవసరమైతే మళ్ళీ పరీక్షలకు గురిచేసి సరిచూసుకొనే పద్ధతిని శాస్త్రీయ పద్ధతి అంటాం. ఈ పద్ధతిలోనే దేనినైనా నిగ్గుతేల్చాలన్న వైఖరిని కలిగివుండటం శాస్త్రీయదృక్పథం. ఇది కొరవడినందువల్లనే దైవభావం మొదలుకొని వాస్తు, జ్యోతిష్యం, మంత్రవిద్య, బాణామతి, మొదలైన మూఢనమ్మకాలు జనంలో ఉన్నాయి. దురాచారాలు, మూఢాచారాలు కొనసాగుతున్నాయి. అవతారమూర్తులు, జ్యోతిష్యులు, వాస్తుపండితులు, మంత్రగాళ్ళు, స్వాములు, మాతలు, తండోపతండాలుగా తయారై ప్రజల్ని దోచుకుంటున్నారు. అనేక నేరాలకు ఘోరాలకు పాల్పడుతున్నారు. అక్కడక్కడా ఇలాంటి వారి బండారం బయటపడుతున్నా వారిని వదిలి జనం మరో దగాకోరును ఆశ్రయించడానికి కూడా శాస్త్రీయదృష్టి కొరవడటమే కారణం. నిరక్షరాస్యులే కాక, అక్షరాస్యులు, గౌరవప్రదమైన వృత్తులలో, హోదాలలో, పదవులలో ఉన్నవారు, కూడా అలా చేయటానికి కారణం వారు నేర్చిన విద్యలో శాస్త్రీయత లోపించటమే. ప్రభుత్వం విద్యాప్రణాళికల్లో శాస్త్రీయదృష్టిని పెంచే విధానాలను రూపొందించడం లేదు. శాస్త్రీయదృక్పథం అలవడిన ప్రజానీకం ఉండటం ఒకదేశపు మేధోప్రమాణతకు సూచిక. కనుక దానిని ప్రచారం చేయడానికి వేదిక పూనుకుంటుంది.

### కర్తవ్యాలు:

1. ఆధునిక విజ్ఞానం సహాయంతో మూఢనమ్మకాల, మూఢాచారాల నిర్మూలనకై వేదిక నిరంతర ప్రచారం సాగిస్తుంది.

2. అవతారమూర్తులు, మంత్రగాళ్ళ అశాస్త్రీయ నమ్మకాలను పెంచే మోసకారుల బండారాలను వెల్లడించే కార్యక్రమాలను చేపడుతుంది. వారిపై అవసరమైన చట్టాల తయారీకి, వాటి అమలుకు పోరాడుతుంది.

3. శాస్త్రీయ విద్యాప్రణాళిక తయారీకి, దాని అమలుకు ప్రయత్నిస్తుంది.

4. శాస్త్ర, సాంకేతిక రంగాలలో వస్తున్న ప్రగతిని ప్రజల వద్దకు చేర్చే కృషి చేస్తుంది.

5. నిర్మాణాత్మకమైన, ప్రగతికి సానుకూలమైన, విశాల ఆలోచనలను పెంచేవిధంగా ప్రతియేటా ప్రత్యేక అధ్యయన తరగతులను నిర్వహిస్తుంది.

## 8. సహకార ఆర్థిక విధానం:

పరిణామక్రమంలో మనిషికి సంక్రమించిన అవాంఛనీయ విలువల్లో స్వార్థమూ ఒకటి. కుటుంబ జీవనం ఏర్పడి, వ్యక్తిగత సంపద పట్ల మోజు పెరిగినపుడే దోపిడీ స్వభావమూ జతపడింది. అలాగే, సహజంగా వచ్చిన తోటివారిపట్ల ప్రేమ, జాలి వంటి మానవీయ విలువలతోపాటు ఆలోచనాశక్తి ఎదిగాక, "సహకారం", "సామరస్యం" వంటి సామాజిక విలువల్ని కూడా మానవుడు ఏర్పర్చుకున్నాడు. పరస్పర సహకారంతోనే, సామరస్య

పూర్వకంగా ఉమ్మడి జీవన అవసరాలను తీర్చుకుంటూ, ఫలితాలను పంచుకోవటం అనేది సమాజ అభివృద్ధికి దోహదపడుతున్న సంగతి నేటికీ మనం గమనించవచ్చు. అయితే, ఈ భావన లోపించి సహకారం ప్రయోజనాన్ని గుర్తించని స్వార్థపరుల్లో పెరుగుతూ వచ్చిన దోపిడీ మనస్తత్వ కారణంగా ఆర్థికరంగంలో అసమానతలు క్రమంగా విస్తరించాయి. సంఘంలో హోదా, పెద్దరికం, పెత్తందారీతనం లాంటి మిథ్యావిలువల్ని సంపద ద్వారా సొంతం చేసుకునే విధానాలు కూడా వ్యవస్థీకృతమయ్యాయి. ఇది ప్రాకృతిక సమన్యాయానికి పూర్తి విరుద్ధమని మా.వి.వే. భావిస్తుంది. ఈ అసమానతల వ్యవస్థ క్రమంగా నీరసించి, నిర్వీర్యం కావాలంటే సహకార ఆర్థిక విధానాలు రావాలి. గ్రామస్థాయి నుండి నగరస్థాయి వరకు వున్న ఉత్పాదక, సేవారంగాలన్నింటిలోనూ, వాణిజ్య సంస్థల్లోనూ ఈ సహకార పద్ధతి అమలు కావాలి. తద్వారా ప్రతి ఒక్కరికీ బాధ్యతను, ఫలితాన్నీ పంచినట్లవుతుంది. ఈ పద్ధతి ద్వారా ఆర్థిక అసమానతలు తొలగటమే కాకుండా, పరస్పర స్నేహం, సహకారం, శాంతి, సమానత వంటి సామాజిక జీవన విలువలు కూడా వృద్ధి చెంది, ఇప్పటికంటే మెరుగైన జీవన విధానం ఏర్పడుతుందని మా.వి.వే. ఉద్దేశపడుతున్నది.

### కర్తవ్యాలు:

1. సహకార ఆర్థిక విధానాల ప్రయోజనాలను తెలిపే సాహిత్యాన్ని, కళారూపాలను మా.వి.వే. ప్రచారంలోకి తెస్తుంది.
2. సభలు, చర్చాగోష్ఠులు, అధ్యయన తరగతులు మొదలగు వాటి ద్వారా నేటి ఆర్థిక వ్యవస్థలోని లోటుపాట్లను, సహకార విధాన ఆవశ్యకతలను తెలియజేస్తుంది.
3. దోపిడీమయ వ్యాపార, వాణిజ్యాల వల్ల దాపురించే ప్రమాదాలను, సహజ వనరుల దుర్వినియోగాన్ని గూర్చి ప్రజల్లో అవగాహన పెంచే చైతన్య కార్యక్రమాలను రూపొందిస్తుంది.

## 9. ప్రకృతి సమతుల్యత:

ఎంత ఉన్నతునిగా ఎదిగినా మనిషి ప్రకృతిలో ఒక భాగమే. మిగిలిన జీవజాతుల కంటే ఉన్నతంగా ఎదిగిన మనిషికి, తన మనుగడకు మూలాధారమైన ప్రకృతిని కాపాడుకోవలసిన బాధ్యత ఉంది. పెరుగుతున్న రకరకాల కాలుష్యాలు, తరుగుతున్న సహజవనరులు, విస్తరిస్తున్న వివిధ రుగ్మతలు, మానవసాంఘిక భద్రతకు సవాళ్ళుగా మారుతున్నాయి. స్వదేశీ, విదేశీ కంపెనీల ధనవ్యామోహానికి, స్వార్థానికి ప్రకృతిలో వికృతి పెరుగుతున్నది. ఆహార, ఆరోగ్య అభద్రతలు ఆందోళన కలిగిస్తున్నాయి. దీనిపై అటు పాలకులను, ఇటు ప్రజలను చైతన్య పరచవల్సి ఉంది.

### కర్తవ్యాలు:

1. పర్యావరణ పరిరక్షణా స్పృహను ప్రజలలో పెంచేందుకు కృషి చేస్తుంది.
2. ప్రజారోగ్యానికి హానికరమైన వస్తువుల ఉత్పత్తిపై అవలంబించే ప్రభుత్వ విధానాలపై పోరాడే చైతన్యాన్ని ప్రజలలో పెంచుతుంది.
3. పర్యావరణానుకూల జీవనశైలిని ప్రచారం చేస్తుంది.

## 4. కార్యాచరణ:

పై ఆశయాల సాధనకు అవసరమైన అన్ని కార్యక్రమలను అహింసా పద్ధతులలో శాంతియుతంగా అమలుచేస్తుంది. మిత్ర సంఘాలతో సామరస్యపూర్వక సహకార సంబంధాలను కలిగి ఉంటుంది.

# బి. నిబంధనావళి

1. సంస్థపేరు : మానవ వికాస వేదిక
2. కార్యాలయం : 5-229, జెపియన్.నగర్, మియాపూర్, హైదరాబాద్-49
3. పరిధి : భారతదేశం
4. సంస్థ చిహ్నం :

## 1. సభ్యత్వం:

1. సంస్థ ఆశయాలను, నిబంధనలను ఆమోదించినవారే సభ్యులవుతారు.
2. 18 సంవత్సరాలు వయస్సు నిండి, మానసికంగా ఆరోగ్యవంతులైనవారు సభ్యులుగా ఉంటారు.
3. ప్రతి సభ్యుడూ సంస్థ విధించిన నియమాలకు, క్రమశిక్షణకు కట్టుబడి ఉండాలి.
4. ఇతర సంస్థల్లో వారు కూడా, ఈ సంస్థలో సభ్యులైన వారి ద్వారా వచ్చి సభ్యత్వం తీసుకోవచ్చు. సంస్థ ఆశయాలకు విరుద్ధంగా వ్యవహరించే సంస్థల్లోని సభ్యులకు ఇందులో సభ్యత్వం ఉండదు.

## 2. శాఖల నిర్మాణం

1. ఈ సంస్థకు గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలలో శాఖలుంటాయి.
2. గ్రామశాఖలో కనీసం ముగ్గురు సభ్యులుండాలి. వారిలో ఒకరు కన్వీనర్ అవుతారు.
3. ఎనిమిదిమందికి మించితే కార్యవర్గం ఏర్పడుతుంది. అందులో అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, ప్రధానకార్యదర్శి, సహాయకార్యదర్శి, కోశాధికారి ఉంటారు.
4. కనీసం రెండు గ్రామశాఖలుంటే ఒక మండలశాఖ ఏర్పడుతుంది లేదా మండలం మొత్తంలో కనీసం 15 మంది సభ్యులుండాలి. అంతకంటే తక్కువ ఉంటే కార్యవర్గానికి బదులు కన్వీనర్ ఉంటారు.
5. మండలశాఖ కార్యవర్గంలో అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, ప్రధానకార్యదర్శి, సహాయకార్యదర్శి, కోశాధికారి ఉంటారు. గ్రామశాఖల కార్యదర్శులు, లేదా కన్వీనర్లు కార్యవర్గ సభ్యులుగా ఉంటారు. కార్యవర్గం నిర్ణయిస్తే ఇద్దరికి మించకుండా కార్యవర్గ సభ్యులను నామినేట్ చేసుకొనవచ్చును.
6. కనీసం రెండు మండల శాఖలు ఉంటే ఒక జిల్లా శాఖ ఏర్పడుతుంది. జిల్లా

కార్యవర్గంతోపాటు ఆడిట్ కమిటీ, జిల్లా కౌన్సిల్ ఉంటాయి.

7. జిల్లా కార్యవర్గంలో ఒక అధ్యక్షుడు, ఒకరు/ఇద్దరు ఉపాధ్యక్షులు, ఒక ప్రధానకార్యదర్శి, ఇద్దరు సహాయకార్యదర్శులు, ఒక కోశాధికారి ఉంటారు. ఆడిట్ కమిటి సభ్యులు, మండల శాఖల ప్రధాన కార్యదర్శులు సభ్యులుగా కార్యవర్గం ఏర్పడుతుంది. కార్యవర్గం నిర్ణయిస్తే ముగ్గురికి మించకుండా కార్యవర్గ సభ్యులను నామినేట్ చేసుకొనవచ్చును.

8. జిల్లాలోని ప్రతి ముగ్గురు సభ్యులకు ఒకరు జిల్లా కౌన్సిల్ సభ్యులుగా ఎంపికవుతారు. వీరిని ఆయా మండల శాఖలు నామినేట్ చేస్తాయి. జిల్లా కౌన్సిల్ సభ్యులంతా కలిసి జిల్లా కార్యవర్గాన్ని, ఆడిట్ కమిటి సభ్యుల్ని ఎన్నుకుంటారు. జిల్లా స్థాయిలో అనుబంధ సంఘాల నాయకుల్లో ఒక్కొక్కరిని జిల్లా కార్యవర్గ సభ్యులుగా జిల్లా కౌన్సిల్ ఎంపిక చేస్తుంది.

9. జిల్లా స్థాయిలో ఏ అంశాన్ని అయినా జిల్లా కౌన్సిలే నిర్ణయిస్తుంది.

10. రాష్ట్రశాఖలో కార్యవర్గం, ఆడిట్‌కమిటి, రాష్ట్ర కౌన్సిల్ ఉంటాయి.

11. కార్యవర్గంలో ఒక అధ్యక్షుడు, ఒకరు/ఇద్దరు ఉపాధ్యక్షులు, ఒక ప్రధానకార్యదర్శి, ఇద్దరు సహాయ కార్యదర్శులు, ఒక కోశాధికారి ఉంటారు. జిల్లా శాఖల ప్రధాన కార్యదర్శులు, ఆడిట్ కమిటి సభ్యులు, అనుబంధ విభాగాల నాయకులలో ఒక్కొక్కరు కార్యవర్గ సభ్యులుగా ఉంటారు. కార్యవర్గం నిర్ణయిస్తే ఐదుగురికి మించకుండా కార్యవర్గ సభ్యులను నామినేట్ చేసుకొనవచ్చును.

12. ప్రతి అయిదుమంది సభ్యులకు ఒకరు వంతున రాష్ట్రకౌన్సిల్ సభ్యులు ఎంపికవుతారు. ఈ సభ్యులను జిల్లా కార్యవర్గాలు నామినేట్ చేస్తాయి.

13. రాష్ట్రంలో ఏ అంశాన్ని అయినా రాష్ట్రకౌన్సిల్ సభ్యులతో నడిచే జనరల్ బాడీ నిర్ణయిస్తుంది.

14. రాష్ట్ర కార్యవర్గాన్ని, ఆడిట్ కమిటీని, జనరల్‌బాడీయే ఎంపిక చేస్తుంది. అనుబంధ సంఘాల నాయకులలో ఒక్కొక్కరినీ కార్యవర్గ సభ్యులుగా నామినేట్ చేస్తుంది.

15. జిల్లా, రాష్ట్ర శాఖలలో గౌరవ అధ్యక్ష, గౌరవ సలహాదారు వంటి పదవులుండవచ్చు. వీరిని జిల్లా రాష్ట్ర కార్యవర్గాలే నామినేట్ చేస్తాయి. వీరికి ఓటు హక్కు ఉండదు.

16. కనీసం రెండు రాష్ట్రశాఖలుంటే జాతీయశాఖ ఏర్పడుతుంది. ఇందులో జాతీయ కార్యవర్గం, ఆడిట్ కమిటి, జాతీయ కౌన్సిల్ ఉంటాయి.

17. జాతీయ కార్యవర్గంలో ఒక అధ్యక్షుడు, ఇద్దరు ఉపాధ్యక్షులు, ఒక ప్రధాన కార్యదర్శి, ఇద్దరు సహాయ కార్యదర్శులు, ఒక కోశాధికారి ఉంటారు. రాష్ట్రశాఖల ప్రధాన కార్యదర్శులు, ఆడిట్ కమిటీ సభ్యులు, అనుబంధ సంఘాల నాయకులలో ఒక్కొక్కరు జాతీయ కార్యవర్గ సభ్యులుగా ఉంటారు. జాతీయ కార్యవర్గం నిర్ణయిస్తే అయిదుగిరికి మించకుండా కార్యవర్గ సభ్యులను నామినేట్ చేసుకొనవచ్చును.

18. మొత్తం సభ్యులలో ప్రతి పదిమంది సభ్యులకు ఒకరు వంతున జాతీయ కౌన్సిల్ సభ్యులు ఎంపికవుతారు. ఈ సభ్యులను రాష్ట్ర కార్యవర్గాలు నామినేట్ చేస్తాయి. జాతీయస్థాయిలో ఉండే ఏ అంశాన్ని అయినా లేదా రాష్ట్రస్థాయిలో ఉండే కొన్ని ప్రత్యేక అంశాలను జాతీయ జనరల్ బాడీ చర్చించి నిర్ణయాలు చేస్తుంది.

19. జాతీయ కార్యవర్గాన్ని, ఆడిట్ కమిటీని జాతీయ జనరల్ బాడీయే ఎంపిక చేస్తుంది.

అనుబంధ సంఘాల రాష్ట్రనాయకులలో ఒక్కొక్కరిని కార్యవర్గ సభ్యులుగా నామినేట్ చేస్తుంది. గౌరవాధ్యక్ష, గౌరవ సలహాదారు వంటి పదవులుండవచ్చు. వీరిని జాతీయ కార్యవర్గం నామినేట్ చేస్తుంది. ఈ పదవుల్లో ఉన్నవారికి ఓటుహక్కు ఉండదు.
20. సంస్థకు సంబంధించి జాతీయ కార్యవర్గమే సర్వోన్నతమైనది. ఈ సంస్థకు సంబంధించిన స్థిరచరాస్థుల నిర్వహణపై నిర్ణయాలు తీసుకునే అధికారం జాతీయ కార్యవర్గానికి మాత్రమే ఉంటుంది.

## 3. బాధ్యతలు:

1. అన్ని శాఖలలోను కార్యవర్గం చేసే నిర్ణయాలను ప్రధాన కార్యదర్శులు తన సహాయకుల సహకారంతో అమలు చేస్తారు.
2. అధ్యక్షులు, ఆయా శాఖల సమావేశాలకు అధ్యక్షత వహిస్తారు. క్రింది శాఖల కార్యకలాపాలను పర్యవేక్షిస్తారు. అవసరమైనపుడు సూచనలనిస్తారు.
3. అధ్యక్షులు లేని సమయాలలో ఉపాధ్యక్షులు ఆ పనిచేస్తారు. అధ్యక్షుల అన్ని సూచనలు అమలు చేస్తారు.
4. ప్రధాన కార్యదర్శి ఎప్పటికప్పుడు కార్యక్రమాలను నిర్వహిస్తారు. కార్యవర్గ సమావేశాన్ని ఏర్పరచటం, తీసుకున్న నిర్ణయాలను అమలు చేయటం, వివిధ రికార్డులను చక్కగా నిర్వహించటం, సభ్యత్వ కార్యక్రమం, ఆర్థిక నివేదిక తయారీలో కోశాధికారులకు సహకరించటం, ఇతర సంస్థలతో సంబంధాలకు, అన్ని వ్యవహారాలకు బాధ్యత వహిస్తారు. సహాయ కార్యదర్శులకు పని విభజన చేస్తారు. ఆర్థిక పరమైన జమాఖర్చులను ధ్రువపరుస్తారు.
5. సహాయకార్యదర్శులు అన్ని విషయాల్లో ప్రధానకార్యదర్శులకు సహకరిస్తుంటారు.
6. కోశాధికారులు సంస్థ ఆదాయ, వ్యయ పట్టికలు తయారు చేస్తారు. ఆడిట్ కమిటీతో ఆడిట్ చేయిస్తారు. నివేదికను కార్యవర్గానికి, కౌన్సిల్‌కి సమర్పిస్తారు.
7. కౌన్సిల్ సభ్యులు, కార్యవర్గ సభ్యులు తమ శాఖల నిర్ణయాల అమలుకు కృషి చేస్తారు.

## 4. సమావేశాలు:

1. కార్యవర్గం సంవత్సరానికి కనీసం రెండుసార్లు సమావేశం అయి కార్యకలాపాలను సమీక్షించుకోవాలి. సమావేశానికి 1/2 వంతు సభ్యుల కోరం ఉండాలి.
2. తీర్మానాలను, నిర్ణయాలను, సభ్యుల అభిప్రాయాలను రికార్డు చేసి, హాజరైన సభ్యుల సంతకాలు తీసుకోవాలి. వాటిని అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ధ్రువీకరిస్తారు.

## 5. ఎన్నికలు:

1. జిల్లా, రాష్ట్ర, జాతీయ కార్యవర్గంలో ఏ వ్యక్తీ ఒక పదవికి వరుసగా రెండుకంటే ఎక్కువసార్లు ఎంపిక కారాదు.

2. కౌన్సిల్ సంవత్సరానికి ఒక్కసారి సమావేశమై సంస్థ అభివృద్ధిని సమీక్షిస్తుంది. ప్రతి రెండేళ్ళకోసారి జరిగే మహాసభలో కార్యవర్గాన్ని ఆడిట్ కమిటీని ఎంపిక చేస్తుంది.

## 6. ఆడిట్ కమిటీ:

1. ఇది జిల్లా, రాష్ట్ర, జాతీయ శాఖలకు పరిమితం. గ్రామ, మండల శాఖలలో కోశాధికారే ఆడిట్ నివేదికను కార్యవర్గానికి సమర్పిస్తాడు.
2. ఆడిట్ కమిటీలో ముగ్గురు సభ్యులుంటారు. వీరు కౌన్సిల్ సభ్యుల ద్వారా నియమితులవుతారు.
3. అధ్యక్ష, ఉపాధ్యక్షులుగాని, ప్రధానకార్యదర్శి, సహాయ కార్యదర్శులు, కోశాధికారిగాని ఆడిట్ కమిటీలో సభ్యులుగా ఉండరాదు.
4. జిల్లా, రాష్ట్ర, జాతీయ శాఖల జమాఖర్చుల్ని, ప్రచురణల జమాఖర్చుల్ని, అన్ని రకాల ఆదాయ, వ్యయాలని ఆడిట్ చేసి, నివేదికను ఆయా శాఖల కోశాధికారులకు సమర్పిస్తుంది.

## 7. కౌన్సిల్:

1. ఇది సంవత్సరానికి ఒకసారి తప్పక సమావేశం అవుతుంది. ప్రతి రెండేళ్ళకు జిల్లా, రాష్ట్ర, జాతీయ మహాసభలను నిర్వహిస్తుంది. ప్రతి సమావేశానికి 1/3 వంతు సభ్యుల కోరం ఉండాలి.
2. 2/3 వంతు సభ్యులు ఆమోదిస్తే, నిబంధనావళిలో మార్పులు చేయవచ్చు.
3. జిల్లా, రాష్ట్ర, జాతీయ కార్యవర్గ సభ్యులు, ఆడిట్ కమిటీ సభ్యులు ఇందులోనూ సభ్యులే.
4. సాధారణ సభ్యుల్లో 1/4 వంతు మంది రాతపూర్వకంగా కోరినా లేదా కార్యవర్గం నిర్ణయించినా, పదిరోజుల వ్యవధి ఉండేటట్లు సభ్యులకు నోటీసు పంపి అత్యవసర సమావేశాన్ని జరపవచ్చు.

## 8. క్రమశిక్షణ:

1. సంస్థ ఆశయాలకు, నిబంధనలకు వ్యతిరేకంగాను, సంస్థ పరువు ప్రతిష్ఠలకు భంగకరంగాను ప్రవర్తిస్తే అది క్రమశిక్షణారాహిత్యమవుతుంది. ఏ సభ్యుడైనా క్రమశిక్షణ తప్పితే, అతనిపై ఆ శాఖ కార్యదర్శిపేర ఆ శాఖ కార్యవర్గానికి రాతపూర్వకంగా ఫిర్యాదు అందాలి. ఆ ఫిర్యాదు విచారణకు తగినది అనిపిస్తే సభ్యునికి నోటీసు పంపి 30 రోజులలోగా సంజాయిషీ కోరవచ్చు. ఫిర్యాదులోని అంశాలు నిజమైతే సభ్యునిపై చర్య తీసుకొనే అధికారం ఆ శాఖ కార్యవర్గానికి ఉంటుంది. కార్యవర్గంలేని గ్రామ, మండల శాఖల సభ్యుల విషయంలో వాటి పైస్థాయి శాఖలు ఆ పనిని నిర్వహిస్తాయి.
2. కార్యవర్గం తీసుకున్న క్రమశిక్షణాచర్యపై, అవసరమనిపిస్తే సభ్యుడు రెండు నెలల్లోగా పైశాఖకు అప్పీలు చేసుకోవచ్చు.
3. జాతీయ కార్యవర్గ నిర్ణయం అంతిమం.

4. అంతిమ నిర్ణయం జరిగేవరకు కింది శాఖల చర్యలే అమలులో ఉంటాయి.
5. కింది శాఖల కార్యక్రమాలు, నిర్ణయాలు, సంస్థ ఆశయాలకు, నిబంధనలకు వ్యతిరేకంగా గాని, ప్రమాదకరంగా గాని ఉంటే వాటిని రద్దుచేసే అధికారం పై శాఖకు ఉంది. అవసరమైతే క్రింది శాఖల కార్యవర్గాన్ని కూడా రద్దుచేయవచ్చు. శిక్షలు/అప్పీలు విషయంలో పైన చెప్పిన విధానమే వర్తిస్తుంది.
6. వార్నింగ్/సస్పెన్షన్/తొలగింపు వంటి ఏ చర్యలనైనా పై శాఖలు తీసుకోవచ్చు.

## 9. నిధులు-నియమాలు

క్రింది పద్ధతుల ద్వారా సంస్థ నిధులను సేకరించుకోవచ్చు.
1. సభ్యత్వ రుసుము
2. జనరల్ ఫండ్
3. స్వచ్ఛందంగా దాతలిచ్చే విరాళాలు
4. ప్రచురణలపై వచ్చే ఆదాయం.
5. సంస్థ కార్యకలాపాలకోసం ప్రభుత్వ, ప్రభుత్వేతర, దేశ, విదేశీ సంస్థల నుంచి వచ్చే సహాయకాలు, గ్రాంట్లు.
6. కళాప్రదర్శనల ద్వారా వచ్చే ఆదాయం
7. సభ్యత్వ రుసుములో గ్రామ శాఖ 10%, మండల శాఖ 15%, జిల్లా శాఖ 20%, రాష్ట్రశాఖ25%, జాతీయ శాఖ 30% వాటాను కలిగి ఉంటాయి.
8. క్రింది శాఖలు వసూలు చేసిన జనరల్ ఫండ్‌లో జాతీయ శాఖ 30%, రాష్ట్రశాఖ 25%, జిల్లా శాఖ 20%, మండల శాఖ 15%, గ్రామశాఖ 10% వాటా చెందుతాయి.
9. సంస్థకు వచ్చే ఏ రకమైన ఆదాయానికైనా జాతీయ కార్యాలయం ధ్రువీకరించిన రసీదులనే ఇవ్వాలి.
10. సంస్థ నిధులన్నీ ఆయా శాఖల ప్రధాన కార్యదర్శులు, కోశాధికారులు జాతీయబ్యాంకులలో ఉమ్మడిగా తెరిచిన ఖాతాలోనే జమచేయాలి.
11. జాతీయ శాఖ అనుమతితో రాష్ట్రశాఖలు నూతన పథకాలను రూపొందించుకోవచ్చు. వాటికి వసూలు చేసిన నిధుల వివరాలు జాతీయశాఖకు సమర్పించాలి.

## 10. అనుబంధ సంస్థలు:

కార్యాచరణను మెరుగుపరుచుకునేందుకు, సంస్థ బలపడేందుకు తగిన అనుబంధ సంఘాలను మా.వి.వే. ఏర్పాటు చేస్తుంది. ఉదాహరణకు: యువజనవిభాగం, మహిళా విభాగం, మానవతా కార్యక్రమాల విభాగం, లౌకిక వివాహాల ప్రోత్సాహక విభాగం మొదలైనవి. వీటి నిర్వహణకు ఆసక్తిగల నిపుణులైన కార్యకర్తలను నియమిస్తుంది.
1. అనుబంధ సంస్థల ఏర్పాటుకు జాతీయ కార్యవర్గ అనుమతి ఉండాలి.
2. ప్రతి అనుబంధ సంస్థలోని జిల్లా, రాష్ట్ర, జాతీయ నాయకుల్లో ఒకరు ఆయా జిల్లా,

రాష్ట్ర, జాతీయ శాఖల కౌన్సిల్ నిర్ణయం మేరకు ఆయా జిల్లా, రాష్ట్ర, జాతీయ శాఖల కార్యవర్గ సభ్యులవుతారు.

3. సంస్థ ఆశయాలకు భిన్నంగా నడుచుకొనే అనుబంధ సంస్థలపై క్రమశిక్షణాచర్యలు తీసుకొనే అధికారం ఆయా రాష్ట్ర కార్యవర్గాలదే.

## 11. సంస్థ రద్దు / విలీనం

సంస్థ రద్దు కావలసిన పరిస్థితులు వచ్చినా లేదా మరోసంస్థలో విలీనం కావలసి వచ్చినా జాతీయ కౌన్సిల్‌లో నిర్ణయం జరగాలి. హాజరైన సభ్యులలో 3/4 వంతుమంది ఆ నిర్ణయాన్ని ఆమోదించాలి. ఆ సమయానికి ఆ సంస్థ పేరిట, అనుబంధ సంస్థల పేరిట ఉన్న ఆస్తులను, అప్పులను ఆ సమావేశం నిర్ణయించినట్లు జాతీయ కార్యవర్గం అమలు చేయాలి.

# సి. కార్యకర్తలకు కొన్ని నియమాలు

సంస్థలోని అన్ని శాఖల్లో ఉన్న కన్వీనర్లు/కార్యవర్గ సభ్యులు, ఆడిట్ కమిటీ సభ్యులు, జిల్లా/రాష్ట్ర/జాతీయ కౌన్సిల్ సభ్యులు, అనుబంధ సంఘాల నాయకులు క్రియాశీల కార్యకర్తలుగా పరిగణించబడతారు. వారి ఆలోచనలు, జీవితాచరణ, ఉద్యమదీక్ష మిగిలిన సభ్యులను, ప్రజలను ప్రభావితం చేస్తుంటాయి. కనుక వారు ఈ క్రింది నైతిక నియమావళిని పాటించడం మంచిది.

1. సభ్యులు కుల స్పృహ కలిగి ఉండరాదు. ఇతరుల కులాలను తెలుసుకోవాలని, తన కులాన్ని చెప్పాలని ఆసక్తి కలిగి ఉండరాదు. రిజర్వేషన్లు, సర్టిఫికెట్లు మొదలగు వాటికోసం వాడినా అది అంతవరకే పరిమితం కావాలి.

2. కుటుంబం, ఉద్యమం, వృత్తి – ఈ మూడింటికి న్యాయం చేస్తుండాలి.

3. నిత్య వ్యవహారాలలో నిజాయితీని కలిగి ఉండాలి.

4. మద్యపానం, జూదం, లైంగిక విశృంఖలత, మోసం చేయటం వంటి దురలవాట్లను దరిచేరనీయరాదు.

5. కుటుంబ సభ్యులందరితో ప్రజాస్వామిక, మానవ సంబంధాలను బలంగా కలిగి ఉండాలి. కుటుంబ జీవనానికి సంస్థను ఆర్థికంగా ఉపయోగించుకోరాదు.

6. వ్యక్తిగత శీలాన్ని పెంపొందించుకునే వైఖరి కలిగి ఉండాలి.

7. మతపరమైన ఆలోచనలకు, ఆచారాలకు దూరంగా ఉండాలి. అలాంటి వేడుకలకు తప్పక హాజరు కావల్సివచ్చినప్పటికీ ఆయా మతక్రియలలో పాల్గొనరాదు.

8. అందరికీ ప్రేమ పూర్వక మైత్రిని, మానవత్వాన్ని పంచే నైజాన్ని పెంచుకోవాలి.

9. సంస్థ అనుమతి లేకుండా ఏ ఇతర సంఘాల, పార్టీలలో క్రియాశీలక బాధ్యతలు స్వీకరించరాదు.

10. వివేకాన్ని, ఉద్యమ చైతన్యాన్ని పెంచే పుస్తకపఠనం, రచనావ్యాసంగం, ఉపన్యాసధోరణి, ఇతరుల నుంచి నేర్చుకొనే వినయం అలవాటుగా ఉండాలి.

# సంక్షిప్త పరిచయం

'మానవ వికాస వేదిక' తెలుగునాట మానవవాద భావాలను ప్రచారం చేయాలన్న ఉద్దేశ్యంతో 12-9-2004వ తేదీన స్థాపించబడింది. కేవలం 30 మంది సభ్యులు ఆ సమావేశానికి హాజరయ్యారు. హైదరాబాద్‌లోని ఖైరతాబాద్‌లో ఉన్న జనవిజ్ఞానవేదిక రాష్ట్ర కార్యాలయంలో జరిగిన పై సమావేశంలో సంస్థపేరు ఖరారు, ప్రణాళికపై చర్చ, ఆ తర్వాత ఆమోదం ఆరోజంతా జరిగాయి. 2005 జనవరి 3న మా.వి.వే. సంస్థ రిజిష్టర్ (రి.నెం.:03/2005) అయింది. ఆ రోజు నుండి నిర్విరామంగా తన ఆశయాల సాధనకు కృషిచేస్తూనే ఉంది.

## రాష్ట్ర మహాసభలు

మానవ వికాస వేదిక ఇప్పటి వరకు (2015 ఆగస్ట్) 4 రాష్ట్ర మహాసభలను జరుపుకుంది.

మొదటి మహాసభ- 2005 జనవరి 11,12 - యంవియన్ స్కూల్, ఎల్బీనగర్, హైదరాబాద్

రెండవ మహాసభ- 2008 జనవరి 12,13 - సింగరేణి కమ్యూనిటీ హాల్, గోదావరిఖని, కరీంనగర్ జిల్లా

మూడవ మహాసభ- 2010 డిసెంబర్ 25,26 - హ్యూమనిస్ట్ సెంటర్, బాటసింగారం, రంగారెడ్డి జిల్లా

నాల్గవ మహాసభ- 2013 డిసెంబర్ 28,29 - హ్యూమనిస్ట్ సెంటర్, ,,

తెలుగునేల రెండు రాష్ట్రాలుగా విడిపోయాక తెలంగాణా తొలి రాష్ట్ర మహాసభలు 2015 సెప్టెంబర్ 12, 13 తేదీలలో హైద్రాబాద్‌లోని యూత్‌హాస్టల్ ప్రాంగణంలోనూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తొలి మహాసభలు అక్టోబర్ 24, 25 తేదీలలో విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ హాల్‌లోనూ జరగనున్నాయి.

## అనుబంధ విభాగాలు

మానవ వికాస వేదికకు కొన్ని అనుబంధ విభాగాలున్నాయి.

**1. చేయూత:** ఉద్యమాలలో ఉన్న కుటుంబాల్లోని పేద విద్యార్థులకు, వ్యాధిపీడితులకు, ప్రకృతి విపత్తు సంభవించిన ప్రాంతాల ప్రజలకు సహాయమందించే నిమిత్తం ఈ విభాగం పనిచేస్తుంది. రక్తదానం, నేత్రదానం, మృతశరీర దానం, అవయవదానాలను నిర్వహిస్తుంది. ఇది 2008 మహాసభల్లో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చంద్రయ్యగారి ద్వారా ప్రారంభించబడింది.

**2. నవతరం పెళ్ళివేదిక:** ఇది 2002లోనే మా.వి.వే. మహిళా నేతలు బి.లీల, లత ల ద్వారా రిజిష్టర్ అయిన సంస్థ. కులరహిత, మతరహిత, కట్నరహిత వివాహాల్కై యువతను ప్రోత్సహిస్తుంది. 2015 వరకు 25 వివాహాలను స్వయంగా నిర్వహించింది. అలాంటి వివాహాలను కోరుకునే యువతీ యువకులకు ఎంతోమందికి ప్రేరణనిచ్చింది.

**3. హ్యూమనిస్ట్ యూత్:** 2010లో ప్రముఖ హేతువాది, నాటి ఐ.హెచ్.ఇ.యు. డైరక్టర్ బాబుగోగినేని 3వ రాష్ట్ర మహాసభల్లో ప్రారంభించారు. అప్పటి నుండి ప్రతి ఏటా యువతీయువకులకు మానవవాదం, వ్యక్తిత్వవికాసం, స్వయం ఉపాధి మొదలగు అంశాలపై

శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నది. తెలుగనేలపై వందలాది సైన్సు ప్రచార కార్యక్రమాలను పాఠశాలల్లో, కళాశాలల్లో, గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించింది.

**4. హ్యూమనిస్ట్ సెంటర్:** మానవవాద మహిళానాయకురాలు శ్రీమతి మల్లాది సుబ్బమ్మగారు అందించిన విరాళంతో ఈ సంస్థ ప్రారంభమయింది. రంగారెడ్డి జిల్లా బాటసింగారం గ్రామంలో (రామోజీ ఫిల్మ్‌సిటీకి 3 కి.మీ. దూరంలో) నిర్మించబడిన ఈ భవనాన్ని 2010 డిసెంబర్ 25న, ప్రసిద్ధ శాస్త్రవేత్త, హ్యూమనిస్ట్, సి.సి.యం.బి. వ్యవస్థాపక డైరక్టర్, పద్మవిభూషణ్, భారత నాలడ్జ్ కమీషన్ వైస్ ఛైర్మన్ డా॥ పి.యం.భార్గవ ప్రారంభించారు. హేతువాద, మానవవాద సంఘాలు అధ్యయన తరగతులు, సభలు జరుపుకోవటానికి, వివిధ శిక్షణా కోర్సులకు వినియోగమవుతున్నది.

**5. స్వేచ్ఛాలోచన మాసపత్రిక:** "మానవ వికాసం" పేరుతో ఒక న్యూస్ బులిటన్‌ను అక్టోబర్ 2004 నుండి ప్రచురించటం జరిగింది. 2005 జనవరి నుండి 'మానవ వికాసం' మాసపత్రికగా (36 పేజీలతో) రావటం మొదలై 2006 అక్టోబర్ వరకు నిరంతరాయంగా (22 సంచికలు) నడిచింది. ఆ తర్వాత, "స్వేచ్ఛాలోచన" పేరుతో 2006 నవంబర్ నుండి 1/8 డెమ్మీ సైజులో వచ్చిన పత్రిక, 2015 ఫిబ్రవరి నాటికి 100 సంచికలు పూర్తి చేసుకొని క్రౌన్ సైజులో 52 పేజీలతో, రంగుల కవరు పేజీలతో అచ్చవతూ వస్తోంది.

## మరికొన్ని విషయాలు...

**ఆదాయపన్ను రాయితీ:** సంస్థ చేస్తున్న ప్రజోపయోగ, ప్రజాచైతన్య కార్యక్రమాలను పరిశీలించి భారత ప్రభుత్వ ఆదాయపన్ను విభాగం వారు, మా.వి.వే.కు అందించే విరాళాలకు సెక్షన్ 80జి కింద రాయితీ సౌకర్యం కల్పించారు. ఆ సౌకర్యం నేటికీ ఉంది.

**జాతీయ, అంతర్జాతీయ సంస్థల్లో:** మా.వి.వే. జాతీయ స్థాయిలో "భారత హేతువాద సంఘాల సమాఖ్య" (ఫిరా)తో అనుబంధం కలిగి ఉంది. అంతర్జాతీయంగా "ఇంటర్నేషనల్ హ్యూమనిస్ట్ అండ్ ఎథికల్ యూనియన్" (ఐ.హెచ్.ఇ.యు.-లండన్)లో సభ్యత్వం కలిగివుంది.

**కుటుంబమేళా:** హేతువాద, మానవవాద కుటుంబాల మధ్య సాన్నిహిత్యాన్ని, స్నేహభావాన్ని, బంధుత్వాన్ని పెంచటంకోసం మానవ వికాస వేదిక "కలుసుకుందాం-తెలుసుకుందాం" కార్యక్రమాన్ని రూపొందించి 2009 జూన్ నుండి అమలు చేస్తోంది. ప్రతినెలా ఒక హ్యూమనిస్ట్ కుటుంబం, మిగిలిన కుటుంబాల సభ్యుల్ని తమ ఇంటికి ఆహ్వానించి, ఆతిథ్యమిస్తారు. ఆ రోజంతా యువతీయువకులు, బాలబాలికలు, మహిళలు వివిధ విజ్ఞాన, వినోద కార్యక్రమాలతో గడుపుతారు.

**మీరు సైతం:** మా.వి.వే. ప్రణాళికలో పేర్కొన్న ఆశయాల ప్రచారం కోసం వేలాది కార్యక్రమాలు చేపట్టి ప్రజల్లో అభిమానం పొందగల్గింది. మతరహిత, ప్రత్యామ్నాయ ఆలోచనలు, జీవన విధానాలతో వందలాది కుటుంబాలు చైతన్యమయ్యాయి. ఈ సంస్థ ప్రణాళిక, కార్యాచరణ మీకు నచ్చితే, మీరు సభ్యులుగా చేరవచ్చు. తుది నిర్ణయం మీదే.

## సదా మీకు ఆహ్వానం




కరీంనగర్ జిల్లా
రాజాపూర్‌లో
మూఢనమ్మకాల నిర్మూలనకై
వెంకటస్వామి నేతృత్వంలో
మా.వి.వే. కళామండలి
మేజిక్ ప్రదర్శన
(31-5-2009)



కేరళ యుక్తివాద సంఘం నాయకులు శ్రీని పట్టతానం గారికి డా. ఎన్.ఇన్నయ్యగారి హ్యూమనిస్ట్ అవార్డు బహుకరిస్తున్న సందర్భం (2014)



రాజ్యం నుండి మతాన్ని వేరు చేయాలన్న డిమాండ్‌తో, ఢిల్లీలో ఫిరా నిర్వహించిన జాతీయ ధర్నా కార్యక్రమంలో మా.వి.వే.




ఫిరా 9వ జాతీయ సదస్సులో (ఒరిస్సా) మా.వి.వే. అధ్యక్షులు యం.యస్.యన్.మూర్తి






హ్యూమనిస్ట్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న సుప్రసిద్ధ శాస్త్రవేత్త,
పద్మవిభూషణ్ పి.యం.భార్గవ (25 డిసెంబర్ 2010)




మా.వి.వే. ప్రణాళికను విడుదల
చేస్తున్న నాటి ఐ.హెచ్.ఇ.యు.
ఎగ్జిక్యూటివ్ డైరక్టర్
బాబు గోగినేని
(10-11, జనవరి 2005)

మా.వి.వే. కుటుంబమేళాలో
ప్రసంగిస్తున్న
ప్రగతిశీల మహిళాసంఘం
నాయకురాలు సంధ్య
(9-11, జనవరి 2007)







ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహించిన ధర్నాలో
పాల్గొన్న మా.వి.వే. (తేది. 24, 25 నవంబర్ 2013)



హేతువాద, మానవవాద ఉద్యమ మార్గదర్శి
రావిపూడి వెంకటాద్రి గారికి
2013 హ్యూమనిస్ట్ అవార్డు అందిస్తున్న సందర్భంలో...